

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 17 మార్చి-ఏప్రిల్, 2021 సంచిక : 10, 11

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ ఎం. సత్యనారాయణ M.Tech.
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

చిరునామా :-
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code: SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .................... 2
DECLARATION .................... 6
కర్మ గురించి బాబా .................... 7
సాయిభక్త దాసగణు .................... 10
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 13
శాశ్వత ధర్మగోప్త .................... 16
బాలవాణి .................... 19
శ్రీ సనాతన ఋషి .................... 21
తీరు మారితేనే తీర్థఫలం .......... 24
మాతృసంస్థ కబుర్లు .................... 30
గురుదేవుల జన్మదినం .................... 32

(ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.)







# మా వాణి





సాయి బంధువులందరికీ ప్రణామశతాలు. అర్ధరాత్రి పన్నెండున్నర యింది. ఏదో కల.... అస్పష్టంగా ... హఠాత్తుగా మెలకువ.... ఆ వెంటనే ఏదో భావపరంపర....

“భగవంతుడి క్కూడా కాస్త తిక్కుందనుకొంటానండీ! లేకపోతే యీ సృష్టేమిటి? ఈ పద్ధతులేమిటీ? మనిషిని జ్ఞానమూర్తిగా చేసాడా?-సరే, అలాగే ఉంచవచ్చు గదా! మళ్లీ మధ్యలో మాయలో పడేలా ఎందుకు చేయాలి? తిరిగి గురువును పట్టుకొని పైకిరావాలని ఎందుకనాలి? చచ్చేంత ఆస్తి యిస్తాడు-తింటే అరగని రోగమిస్తాడు. అత్యద్భుతమైన అందానికి మట్టిబుర్ర-ఎనలేని మేధాసంపత్తి ఉన్న వాడికి ఎండురొట్టె కూడా దొరకని పరిస్థితి-ఏమిటీ మాయగోల!” అంటూ విసుక్కొన్నాడు. సుందరరావు మొన్న ఏదో మాటల సందర్భంలో, అప్పుడు చాలా పని ఒత్తిడిలో వున్నాను-అంచేత చర్చించటం కుదరలేదు-ఆ అర్ధరాత్రి మెలకువలో సుందరరావు ప్రశ్న ... ఆ వెంటనే ఏవో ఆలోచనలు ...

పరమపూజ్య గురుదేవులు ఎప్పుడూ ఒకమాట చెప్తుంటారు. “భగవంతుడు కేవలం జడ్జి మాత్రమే” అని. మన రాబోయే జన్మ మనం యిప్పుడు తయారు చేసుకొంటున్నామన్న సంగతి క్షణ క్షణం గుర్తు చేసుకోవాలి. మనం ఎలా ప్రవర్తిస్తున్నాం? ఇతరులకు ఎలాంటి ఆనంద విషాదాలు పంచుతున్నాం? నైతికత, ధార్మికతలు ఎంతవరకు ఆచరిస్తున్నాం? ఇవన్నీ కలిసి మనకు కొన్ని పాపాలు, కొన్ని పుణ్యాలు ఇస్తాయి. తత్ఫలితంగా వచ్చే సంస్కారాల బలం మనకు ఎలాంటి జన్మరావాలో నిర్ణయిస్తుంది. అంటే ఆ సంస్కారాల మీద ఆధారపడే భగవంతుడు మనకు జన్మ ప్రసాదిస్తా

డన్నమాట! మరి - మన జీవితానికి మనమే కర్తలమన్నమాటే గదా!

"భగవంతుడు అన్నీ మంచివే సృష్టించాల్సింది. చెడు సృష్టించడమెందుకు?" అన్నది ప్రశ్న. మంచీ-చెడూ, చలీ-వేడీ, అందం-వికృతత్వం-ఇలా వైరుధ్యాలంటూ ఉంటేగానీ జగతి నడవదు. స్త్రీ, పురుషుడూ వుంటేనే సృష్టి. అంచేత దైవం అన్నీ మంచే సృష్టించాలనటం అర్థం లేని మాట. అసలు భగవంతుడు కాక మరొకడు ఉండటం-అంటేనే సృష్టి ప్రారంభమైనదని అర్థం గదా! అప్పడున్న యిద్దరిలో ఒకరు మహోన్నతుడైన పరమాత్ముడు, మరొకరు అతి సామాన్యుడైన జీవాత్మ-మరి మనుష్యులు ఎందుకు పతనం చెందుతున్నారు? పరమాత్ముడు అలా ఎందుకు చేస్తున్నాడు? అది కూడా ఆయన చెయ్యటం లేదు-మనమే చేసుకుంటున్నాం. ఎలా చేసుకుంటున్నాం? అన్నదే ప్రశ్న.

అరిషడ్వర్గాన్ని జయించిన వారికిగానీ, అంతశ్శుద్ధి కలగదు. అట్టి వానికి తప్ప మోక్షం రాదని సర్వ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. వైరి వర్గంలో మొదటివాడైన కాముడిని జయించడం ఎంత కష్టమో అనేకమంది భ్రష్ట యోగుల కథలు మనకు సాక్ష్యమున్నాయి. అయినా మనిషి 'కామిగాక మోక్షగామి కాడు' అనే సిద్ధాంతాన్ని తయారుచేసుకున్నాడు. "ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి" అని తాను అగ్నిసాక్షిగా చేసిన ప్రమాణాన్ని తానే తప్పి భ్రష్టుడయ్యాడు. పైగా అలా నలుగురైదుగురు స్త్రీలతో తిరగడానికి 'దక్షిణ నాయకత్వం' అని ఒక పేరు తగిలించుకున్నాడు. అలా తిరగేవాడు కాస్త కలిమి కలిగినవాడో, ప్రభుత కలిగినవాడో అయితే-వాడి చుట్టూ చేరిన భజనపరులు ఆయనగారి పైత్యప్రకోపాన్ని 'రసికత' అని కీర్తించారు. 'యథారాజా తథా ప్రజా' అన్న సూత్రాన్ని అనుసరించి సామాన్యజనం కూడా కాముకులే అయ్యారు. ఒక అపురూపసుందరినో, ఒక అద్భుత దృశ్యాన్నో చూడగానే దాన్ని సృష్టించిన పరమాత్ముని హస్తం ఎంత గొప్పదో అని ఆశ్చర్యపడటం, ఆ స్వామికి నమస్కరించటంపోయి, దాన్ని అనుభవించాలి,





సొంతం చేసుకోవాలి అన్న భావం వెంటాడింది మనిషిని. దీనికి మూలమైన లోలత్వం, నీచత్వం అర్థంగాక మనిషి దానికి కూడా ప్రేమ అనే పేరే పెట్టుకున్నాడు. ప్రేమ పేరుతో కామానికి హద్దులు లేకుండాపోయాయి. అలా పతనానికి పరాకాష్ఠకు వెళ్లిపోయాడు.

ఒక క్రోధం-దీనికి తాను లోనైనప్పడల్లా ఇది అహంకార జన్యమన్న సంగతి మరిచిపోయాడు. ఎదుటి వారి అన్యాయపూరిత ప్రవర్తన వలననో, అవమానపూర్వక వాక్కులవలననో తనకు క్రోధం కలుగుతున్నది తప్ప తన లోపల క్రోధబీజం లేదంటాడు. ఈ క్రోధానికీ, ధర్మ పోరాటానికీ భేదం గుర్తించని కారణంగా అనేకరకాల అరాచక చర్యలు సాగుతున్నాయి లోకంలో. మన దేశంలో అనూచానంగా వస్తున్న పరమ పావనమైన ధార్మిక రీతులన్నిటినీ భ్రష్టుపట్టించే ప్రయత్నం చేయటమేగాక, ఆ ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తున్నందుకు భారతజాతిపై ధర్మయుద్ధం ప్రకటిస్తామని ఎగిరి పడుతున్న విధర్మీయుల తీరు ఇటువంటిదే.

ఇలాగే లోభ మోహాదుల విషయంలో కూడా. "నా కష్టం నేను దాచుకుంటున్నానుగానీ, పరుల సొత్తు కాదే!" అనే తీర్మానంతో మనిషి ఆత్మ వంచన చేసుకున్నాడు. "నీ ఆర్జనకు నీవు ధర్మకర్తవు మాత్రమేగానీ భోక్తవు కావు. కేవలం ఆరవ వంతుకు మాత్రమే నీవు భోక్తవు (అనుభవించే వాడివి)" అన్న ధర్మశాస్త్ర శాసనం పట్టించుకోలేదు. గృహస్థుగా తాను ఆర్జించే సంపదలో బ్రహ్మచారి, సాధు సత్పురుషుల వాటాలు, దైవకార్యపు వాటాలు తీసి వేసాకనే తాను తినాలన్నది మరచి, సమస్తం మూటగట్టుకొని భ్రష్టుడైపోయాడు. దేనినైనా, ఎవరినైనా ఎడబాయలేని వ్యామోహానికి ఏవేవో అందమైన పేర్లు-అనుబంధమో, జన్మ జన్మల బంధమో, వల్లకాడో ఏదో పెట్టుకొని ఆత్మ భ్రష్టత్వాన్ని ఆహ్వానిస్తున్నాడు.

ఇక అహంకార మమకారాల గురించైతే చెప్పనే అక్కరలేదు. "నేను తలచిందే సత్యం-నేను ఆచరించిందే ధర్మం!" అన్నట్లుగా సంచరించే

మనిషి కూడా తాను అహంభావినని ఒప్పుకోడు గాక ఒప్పుకోడు. నాది అహంకారం కాదు-ఆత్మవిశ్వాసం అంటాడు. సాయిధామం ఆశ్రమంలో ఒక వృద్ధురాలున్నది. వృద్ధాప్యం వయసు లెక్కకేగానీ, ఆమె మనస్సుకు గానీ, శరీరానికిగానీ (కొద్దిగా తప్ప) రాలేదు. ప్రశాంత జీవనం, నిత్య సాయీ సేవా కావాలని ఆశ్రమంలోకి వచ్చిందామె. సన్యాసం తీసుకోవాలన్న ఉబలాటం కూడా లేకపోలేదు. అయితే ఏ బంధువులైనా తమ యింట పెళ్ళనో, పేరంటమనో ఆహ్వానించినా, కర్మో, తద్దినమో అని చెప్పి పంపినా-ఆమె గారి సాధన కాస్తా చెట్టెక్కేస్తుంది. వాళ్లు తనకెంత ఆప్తులో మనిషి మనిషికీ వివరించి మరీ పరుగెత్తుకు వెళ్లిపోతుంది. నెలకో, రెండు, మూడు రోజులైనా యిలా ఏదో ఊరు తప్పదు. ఓసారి అది సాధకుడికి తగవు కాదనీ, అత్యవసర పరిస్థితులలో తప్ప అలా వెళ్లవద్దనీ, యీ ఆహ్వానాలు కూడా మాయలో ఒక భాగమనీ అన్నాము. వెంటనే ఆమె "నన్నేం పని చెయ్యడానికి పిలుస్తున్నారా! పెద్దదాన్ననీ, సలహాలివ్వడానికి పనికి వస్తాననీ గౌరవంతో రమ్మంటున్నారంతే!" అన్నది. ఇదే పెద్ద మాయావాగుర. ఒకవేళ యీమె కాలూ, చెయ్యీ కదలని దశలో పడితే వారంతా పిలుస్తారా? ఆందోళికలు పంపి తీసుకువెళతారా! ఒకవేళ ఆమె అన్నదే సత్యమైనా యీ మలిసంధ్యలో, సమయం అతి తక్కువే మిగిలి ఉన్న యీ కడపటి దశలో యీ బంధాలన్నీ మనకు ఏ విధంగా ఉపకరిస్తాయి? ఇదంతా యోచించనీయని మమకారమే సాధనను భ్రష్టం చేస్తుంది.

మొత్తం మీద - సోదర సాధకులారా! మనకు పరమాత్ముడిచ్చిన అనంత శక్తులనూ అణగార్చివేసి, ఆత్మ శక్తినికననీయక కళ్లు మూసే యీ పతనావస్థల నుండి మనం స్వయంకృషితో పైకి లేవగలగాలి. ఎప్పటికప్పుడు కనీసం నెలకొక్కసారైనా ఆత్మ పరిశోధన అవసరం. నిర్మలమైన, నిష్పాక్షికమైన ఆలోచనలతో మనను మనం తరచి చూచుకోగలిగితే-స్వయం పతనం అన్న మాట మనందరికీ రాకుండా ఉంటుంది. అట్టి ఆత్మ విచార శక్తి మనకిమ్మని సమర్థ సద్గురు శ్రీ సాయిదేవుల వారిని ప్రార్థిద్దాం.





# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sachidananda Sadguru Sai Vani Publications, Saidhamam, Yadadri Bhuvanagiri Dist- 508 126 |

I, Brahmachari Sri Ramananda Prabhuji declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2021

Sd/-

Sri Ramananda Prabhuji

# కర్మ గురించి బాబా ఇంకా ఇలా చెప్పారు

- భారం ఉమామహేశ్వర రావు

"కర్మ ఫలములయందు ఆసక్తి లేక కర్మలు చేయండి. కర్మయందు అకర్మత్వము అకర్మయందు కర్మత్వమును చూడండి".

"మీ ఆత్మ నిర్మలము కావలయునంటే ఫలాపేక్ష వదలి కర్మ యోగము ఈశ్వరార్పణ బుద్ధితో చేయండి. నిష్కామ కర్మ యోగముచే దైవభక్తి, దైవ భక్తిచే జ్ఞానోదయము, జ్ఞానోదయముచే ముక్తి కలుగును. అంతేగాక నిష్కామ కర్మ యోగముచే పాప నివృత్తియు, ఉపాసనచే నివృత్తియు, బ్రహ్మతత్వ విచారణముచే ఆవరణ నివృత్తియు కలుగును. ఎవరైతే తన ఛాయను విడచి నడిచే శక్తిని పొందగలరో వారికి కర్మ ప్రధానము కాదు. సంకల్పమే ప్రధానము. అట్లుగాక తన నీడ తనతో వచ్చుచుండిన అట్టి వానికి మనస్సు ప్రధానము కాదు. కర్మయే ప్రధానము. కర్మశుద్ధి ముందుగా చేసుకొన్న సంకల్ప శుద్ధియగును. కనుక కర్మశుద్ధిని చేసు కొనుటకు పాటుపడండి".

"పూర్వ జన్మ కర్మానుసారముగా ఈ జన్మలో మీకు అట్టి స్వభావ గుణములే కలుగును. నిష్కామ కర్మ యోగముచే అంతఃకరణ శుద్ధి కలిగి ఉపాసనచే చిత్తము, ఏకాగ్రత కలిగి బ్రహ్మజ్ఞానముచే మోక్షము కలుగును. కర్మశుద్ధియైనచో సాధన సంపత్తి కలుగును. ఆత్మశుద్ధి కావలయునంటే తపస్సు, ధర్మానుష్ఠానము, భగవద్భక్తి ముఖ్యము".

"మీరు అనేక జన్మల నుంచి నిష్కామ పుణ్య కర్మములు చేయుచు వచ్చుచున్నచో మీ పుణ్యము పరిపక్వమై ఈ జన్మలో దాని ఫలితము పొందగలరు".

"ఎవరైతే సమస్త కర్మలను పరమాత్మయందు సమర్పించి ఫలాపేక్షలేక





చేయుదురో, అట్టి వారు పాపముచే అంటబడరు. కర్మ చెడ్డది కాదు. మీ దృష్టిని పవిత్రము చేసుకొన్నచో మీరు చేయు కర్మ మహాయజ్ఞమై ప్రకాశించుచు మీ భావములు శుద్ధమై మీరు చేయు ప్రతి కార్యము శ్రేయస్కరమై యుండును. మీ కర్మల ద్వారా ఆ పరమాత్మను పూజించిన యెడల ముక్తిని పొందగలరు. దైవార్పణ చేసి కార్యము చేసిన, కర్మ కర్మగా నుండక కర్మ యోగముగా మారును. ప్రవృత్తి యందున్న మనస్సును నివృత్తి యందుంచుకొనండి. దైవార్పణముగా భక్తి పూర్వకముగా చేయు కర్మ, సంసార బంధము నుండి విముక్తిని గలుగజేయును. నియమితమైన కర్మనే చేయండి. కర్మ చేయకుండా యుండుట కంటే చేయుటయే మంచిది. కర్మ చేయకపోవుట వలన మీకు దేహ యాత్ర సిద్ధింపదు. అనంతమునకు పది జోడించినను అనంతమే మిగులును. దైవము అనంతము. జ్ఞానము అనంతము. దైవదృష్టి కలిగి, దైవార్పణ బుద్ధితో ఏ కార్యము చేసినప్పటికి అది కర్మ, బంధము కాదని తెలుసుకొనండి. కాబట్టి కర్మ గొప్పది కాదు. కర్మ చేయు విధానము గొప్పది. ఈశ్వరార్పణ బుద్ధితో చేసిన కర్మయందలి బాధజనకత్వము తొలగిపోవును. కనుక కర్మను పవిత్రంగా చేసుకొనుటకు ప్రయత్నించండి".

"కర్మ బంధము నుండి విముక్తి కావలయునంటే, ఫలాపేక్షతోను సంగముతోను, అభిమానముతోను, కర్తృత్వ బుద్ధితోను కర్మను ఆచరించ కండి. కర్మఫలమును త్యజించిన చిత్తశుద్ధి ద్వారా మోక్షము పొందగలరు. జన్మరాహిత్యమును కూడా సాధించగలరు. సంసార చక్ర పరిభ్రమణ మంతయు ఫలాపేక్షతో కర్మలు చేయువారికే కలుగును. కర్మలన్నియు జ్ఞానమందు లయించి, పరిసమాప్తమగును. అహంకారము కర్తృత్వ బుద్ధిని వదలుకొన్న మీకు కర్మలు అంటవు. దైవము మీకు విధించిన కర్మలను శిక్షితమైన బుద్ధితో కర్త అను భావము విడచి త్రికరణముల ఉద్వేగము లేక యధాశక్తితో ఆచరించండి. ఆ విధముగా ఆచరించే

కర్మలు మీ విద్యుక్త ధర్మములుగా భావించండి. అంతరంగిక స్వాతంత్ర్యము విడువక, లౌకికార్థములకు వశులు కాకండి. నిష్కామ కర్మ, యోగానుష్ఠానముచే, మీ పాపములన్నియు నశింపజేసుకొనండి. సమత్వ బుద్ధితో కర్మలను ఆచరించుచు, వాటి ఫలములను త్యజించిన జనన మరణ బంధముల నుండి విముక్తి పొందగలరు".


కుతంత్రాలకు లోనుకాక మీరు చేసే క్రియలు, భక్తితో హృదయ పూర్వకంగా చేసిన కర్మలు మీకు అంటవు. హృదయములోని అజ్ఞానం వల్ల పుట్టే సంశయాన్ని జ్ఞానమనే ఖడ్గంతో ఛేదించి నిష్కామ కర్మయోగాన్ని ఆశ్రయించండి. మించిన ఆసక్తే సంఘర్షణకు కారణం".

"కర్మ చెడ్డది కాదు. మీ దృష్టిని పవిత్రం చేసుకొని మీరు చేయు కర్మ మహాయజ్ఞమై ప్రకాశించుచు, మీ భావము శుద్ధమైన మీరు చేయు ప్రతి కార్యము శ్రేయస్కరమగును. మీ కర్మల ద్వారా ఆ పరమాత్మని పూజించిన ముక్తిని పొందగలరు. దైవార్పణ చేసి ఏ కార్యము చేసినా కర్మగా యుండక, కర్మయోగంగా మారును. ప్రవృత్తి యందు ఉన్న మనస్సును నివృత్తియందు ఉంచుకొనండి. నిష్కామ పూర్వకముగా కర్మను ఆచరించండి".

"నిష్కామ కర్మానుష్ఠానముచే మీ పాపములన్నియు నశింపజేసుకొనండి. మీ హృదయములలో అజ్ఞానమనే మురికి కప్పబడి యున్నందున, దానిని నిష్కామ కర్మాచరణాదుల ద్వారా, ఆత్మవిచారణ ద్వారా తొలగించుకొని ఆత్మ సాక్షాత్కారం పొందుటకు ప్రయత్నించండి".







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

అంటే, ఆ అధ్యాయం సాయిభక్తుల హృదయ లోగిళ్ళ ముందు వేసిన తొలి సాయి సాహితీ రంగవల్లిగా ఇలపై వెల్లివిరిసింది.

ఆ విధంగా సచ్చిదానంద సద్గురు సామ్రాట్, భక్త దయాళువు, కలియుగ అవతారమూర్తి మరియు అసంఖ్యాక భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ సాయిబాబా చరిత్రను వ్రాసిన తొలి చరిత్రకారునిగా దాసగణు, సాయి భక్తుల హృదయపుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయాడు, సరి!

పారమార్థిక రచన దాసగణు హృదయాన్ని జయించే కొలది, శృంగార గీతాల రచన లయించసాగింది. చివరకు దాసగణు తమాషాల పట్ల పూర్ణ విరక్తుడై, శాశ్వతంగా వాటికి స్వస్తి పలకాలని దృఢంగా నిశ్చయించుకొని, చివరగా ఒకేఒక ప్రదర్శన చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆశ్చర్యంగా తన చివరి శృంగారభరిత తమాషా ప్రదర్శన కోసం దాసగణు ఎంపిక చేసుకున్న స్థలం నెవాసా గ్రామంలోని మోహినీరాజ్ దేవాలయం (మోహినీ రూపంలోనున్న విష్ణుమూర్తి దేవాలయం) సూక్ష్మదృష్టితో అవలోకిస్తే దాసగణు నిర్ణయంలోని ఔచిత్యం మనకు అవగతమవుతుంది. అంతే కాదు, అబ్బురపరిచే దాసగణు యొక్క పారమార్థిక పరిజ్ఞానం మనకు ప్రస్ఫుటమవుతుంది. ఈ విషయాన్ని కొంచెం లోతుగా పరిశీలించుదాం.

భగవంతుని లీలా వినోద కేళిలో భాగంగా మూలతః జీవుడు శివుడు అయినప్పటికీ, మాయ కలిగించే మరపుతో తాను పరిమితుడై శివునితో అనుసంధానాన్ని కోల్పోతాడు. అప్పుడు ఆ భగవంతుడు ఆ జీవుని మరలా శివుని గావించడం కోసం అదే పరిమితమైన దేహంతో అంటే సగుణ

సాకారమూర్తిగా జీవుని ముందుకు వస్తాడు. ఆ సగుణ రూపంలో బాహ్యంగా భాసించేది, మాయా రూపమైన శరీరమైతే ఆ శరీరం లోపల వసించేది శుద్ధ పరబ్రహ్మ తత్వం. అంటే, మాయ మరియు పరబ్రహ్మల సంయోజనం వలననే నిర్గుణ నిరాకారం సగుణ సాకారమవుతుంది. ఆ సంయోగ ఫలితమే మహాత్ముల అవతార జనితం. జీవుని శివునిగా మార్చడమే ఆ అవతరణ యొక్క పరమోద్దేశం. క్లుప్తంగా చెప్పాలంటే, జీవుని ఆవరించియున్న మాయను తొలగించడానికి, భగవంతుడు మరలా ఆ మాయనే-ముల్లును ముల్లుతో తీసే చందంగా-ఆచరించి, సగుణ మూర్తిగా అవతరిస్తాడు. "నేను మాయ మరియు బ్రహ్మల సంయోగంతో జన్మించాను" అని బాబా తమదైన శైలిలో నర్మగర్భంగా ఉచ్ఛరించిన ప్రతిరూపం తమ దేహమని, ఆ పరబ్రహ్మ తత్వమే తమ నిజస్థితి" అని చెప్పకనే చెప్పారు. అంతేకాదు, "బాబా అంటే మీరు చూసే ఈ మూడున్నర మూరల దేహం కాదు" అని చెప్పడంలోని అంతరార్థం కూడా అదే! సరిగ్గా ఆ సత్యమే మోహిని భస్మాసుర కథలో నిబిడీకృతమైయున్న నిగూఢ ఆధ్యాత్మిక రహస్యం.

హృదయ వాసం కలిగియున్న ఈశ్వరునితో బంధాన్ని, అనుసంధానాన్నీ అంతరింపజేయాలని (భస్మం చేయాలని) ప్రయత్నిస్తున్న మాయను (భస్మాసురుని), నిర్గుణ నిరాకారుడు, మాయాతీతుడైన భగవంతుడు (విష్ణువు) ఆ మాయనే ఆసరాగా చేసుకొని అంటే మాయతో సంయోగం చెంది, సగుణ సాకార రూపంలో (మోహిని రూపంలో) వేతెంచి, మానవుని ఆవరించియున్న మాయను (రాక్షసుడిని) నాశనం చేస్తాడు. అప్పుడు మిగిలేది నిత్యమైన, సత్యమైన ఈశ్వరుడే!

తనలోని తమాషా బలహీనత (మాయ) తనను భగవంతునికి దూరం చేస్తున్న నేపథ్యంలో, ఆ నిర్వికార పరబ్రహ్మయే శ్రీ సాయిబాబా రూపంలో సగుణమూర్తిగా వచ్చి, ఆ మాయను తొలగించి "మహాత్ముల చరిత్ర రచనా మాధ్యమంగా" తనలో వసించే భగవత్ తత్వానికి అనుసంధానిస్తున్న





సత్యాన్ని తెలుసుకున్న దాసగణు, మోహినీ రాజ్‌మందిరంలో తన చిట్టచివరి తమాషాను ప్రదర్శించి తన అవగాహనను ఆవిష్కరించారు. "దాసగణు ఇంతటి ఆలోచనతో చేసాడా?" అనే ప్రశ్న ఉదయిస్తే, దాసగణు బాబాకు చేసిన ప్రార్థనను ఈ సందర్భంగా అవలోకిస్తే, అందులో బాబాను ప్రార్థిస్తూ "తుమ్హా మాజీ నసే ద్వైత్" (మీకు నాకు మధ్య ద్వైతము లేదు) అని చెప్పడంలో దాసగణు భావ పరిజ్ఞానం, విద్వత్తు మనకు అవగతమై పై ప్రశ్నకు సమాధానం స్ఫురిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే "మీ నుండి నేను వేరు కాదు" అనే సత్యాన్ని అవగాహన చేసుకున్న సద్భక్తునితో, ఇక ఆ సత్యాన్ని అనుభవంలోకి తీసుకురావడం సద్గురు అవతారకార్యంలో ఒక ముఖ్యమైన ఘట్టం. సమర్థ సద్గురుడైన శ్రీ సాయి దాసగణును - వాస్తవానికి ప్రతి ఒక్క భక్తుని-అంతా తామై నడిపిస్తున్న తీరే అందుకు తార్కాణం. "భగవంతుని నుండి నేను వేరు కాదు" అనే అవగాహన కలగడం ఒక దశ అనుకుంటే, ఆ అవగాహన అనుభవంలోకి రావడం తరువాతి దశ. అందుకు ఎంతకాలం పడుతుంది? అనే ప్రశ్న ఉదయిస్తే, అందుకు సమాధానం ఆ సద్గురునాథునికే ఎరుక. ఆ కాలం సద్గురు అనుగ్రహాన్ని బట్టి మరియు సాధకుని సంస్కారాన్ని బట్టి ఉంటుంది. కానీ, తమతో ఋణానుబంధం కలిగిన ప్రతి ఒక్క భక్తునికి ఆ అనుభవాన్ని ప్రసాదించే ప్రక్రియలో ఆ సమర్థ సద్గురుడు నిరంతరం నిమగ్నమై ఉంటారు. ప్రతి ఒక్క భక్తునికి సంబంధించి తమ నిర్దేశితమైన కార్యాచరణను నిర్విరామంగా కొనసాగిస్తూ ఉంటారు. ప్రస్తుత చరిత్ర నాయకుడైన దాసగణు విషయంలో బాబా తమ అవతార కార్యాన్ని ముందు ముందు ఎలా కొనసాగించారో తెలుసుకునేందుకు సావధాన చిత్తులైన పాఠకులు ఉద్యుక్తులు కావలసినదిగా మనవి. మన పారమార్థిక పురోగమనంలో భాగంగా దాసగణు పారమార్థిక ప్రవాసాన్ని పఠనా మాధ్యమంగా అత్యంత సమీపం నుండి అవలోకించుదాం రండి!

**(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

బాబాకు పూలమాలను సమర్పించి వెంటనే స్వామీజీ చెంతకు వెళ్లి ఈ విషయమంతా వివరించగా స్వామీజీ బాబా ఆశీర్వదించారు నిరాటంకంగా స్థల సేకరణ జరుగుతుందని చెప్పారు.

1993 ఆగస్టు 10వ తేదిన మణి సమక్షంలో ఏ స్థలం ఆశ్రమం కోసం క్రయం చేయాలో స్వామీజీని అడగగా బాబాను వేడుకోండి ఆయనే మీకు ఏ స్థలం తీసుకోవాలో సూచనలిస్తాడు అనగానే స్వామీజీ గదిలో గల గణపతి విగ్రహం వద్ద నున్న పుష్పం క్రింద పడింది. శ్రీమతి జరీనా దానిని తీసి స్వామి పాదాల వద్ద నుంచగా ఆయన “ఇది బాబా నీకిచ్చిన ప్రసాదం నీవే తీసుకో”మని ఆ పుష్పాన్ని ఆమెకు ఇచ్చారు.

1993 ఆగస్టు మాసం 13వ తేదీన రెండు, మూడు స్థలాల వివరాలను సేకరించిన శ్రీమతి జరీనా ఏ స్థలాన్ని తీసుకోమంటారని స్వామీజీని అడగగా బాబా వద్ద చీటీలు వేసి, బాబా చెప్పిన స్థలాన్ని క్రయం చేయమని చెప్పారు. ఆ ప్రకారంగానే బాబా వద్ద చీటీలు వేయగా సంపత్ కాకా స్థలాన్ని కొనమని రాగా ఆ స్థలాన్నే (ఆరు ఎకరములు) క్రయం చేసారు. 17.04.1993న అగ్రిమెంటు వ్రాయించుకుని బాబాకు అత్యంత ఇష్టమైన రోజు మన స్వామీజీ జన్మదినమైన శ్రీరామ నవమి పర్వదినమున (20.04.1994) రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ స్థలం సంపత్ కాకా పూర్వీకులు దాసగణు మహారాజ్‌కు బహూకరించదలచినది. దాసగణు మహారాజ్ అసలు పేరు గణపతిరావు సహస్రబుద్ధి. ఈయన పోలీసుశాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. ఈయన వృత్తికి ప్రవృత్తికి పొంతనే లేదు. ఈయన వృత్తి పోలీసు ఉద్యోగం కాగా ప్రవృత్తి మాత్రం హరికథలు





చెప్పట, నాటకములు వేయుట, రచనలు చేయుట. బాబాను మహారాష్ట్రములోను అలనాటి నిజాం ఇలాకాలోను ప్రజలకు ప్రప్రథమంగా పరిచయం చేసిన పుణ్యమూర్తి. దాసగణు ఎచట హరికథలు చెప్పినను స్టేజి మీద అందంగా అలంకరించిన బాబా ఛాయాచిత్రము నుంచెడివాడు. బాబా దివ్య లీలలను అతి శ్రావ్యంగా గానం చేసి శ్రోతలను భక్తి సాగరంలో ఓలలాడిం చెడి వాడు. ఈయన నటనా కౌశల్యము, హరికథ మధ్యలో చెప్పెడి పిట్ట కథలు ప్రజలను ఎంతో ఆకర్షించెడివి. ఈయన కార్యక్రమమునకు ప్రజలు తండోపతండములుగా వచ్చెడివారు. ప్రతి కార్యక్రమములోను బాబా లీల లను వర్ణించుట, బాబా దివ్యత్వమును పది మందికి అర్థమయ్యే రీతిలో గానం చేసెడివారు. ఈయన గానామృతమును గ్రోలిన భక్తులు బాబా యొక్క మహిమలను విని ఎప్పుడు బాబాను దర్శించెదమాయని ఉవ్విళ్లూరుతూ మారుమూల గ్రామమైన షిరిడీకి వచ్చి బాబాను దర్శించిన వారు వేనకు వేలు. బాబా ప్రతిభను ప్రజలలో చాటిన ప్రప్రథమ కీర్తన కారుడు. బాబా మహాసమాధికి ముందే ఆర్వాచీన భక్త లీలామృతము అను గ్రంథములో 31, 32, 33 అధ్యాయములలోను సంత కథామృత మను గ్రంథములో 57వ అధ్యాయమందును బాబా యొక్క దివ్య లీలలను వర్ణించిన పుణ్యపురుషుడు శ్రీ దాసుగణు మహారాజ్. బాబా కృపతో భీమాజీ పాటిలుకు క్షయవ్యాధి నివారణ కాగా అతను ప్రతి మాసము సాయి సత్యవ్రతము నాచరించి అందులో ఈ నాలుగు అధ్యాయములను చదివేవాడు. బాబా ప్రచారకుడైన దాసుగణుకు బహూకరించదలచిన స్థలమును సాయిసేవకుడైన శివనేశన్ స్వామికి చెందేటట్లు చేసి సంపత్ కాకా పూర్వీకుల కోర్కెను బాబా ఈ విధంగా నెరవేర్చాడు. ‘ఓం సాయి’ (క్రిస్టియానా) ఆశ్రమం పేరు “Sri Sivanesan Swamiji Institute of Higher Education” అని నామకరణం చేసి దానిని సంస్కృత భాషలో వ్రాయాలని

శ్రీమతి జరీనాను కోరింది. 08.12.1993 తేదీన స్వామీజీ 17.12.1993 మంచి రోజు, ఆ రోజున భూమి పూజ చేయించమని ఆదేశించెను. అదే రోజు సాయంకాలం శ్రీమతి జరీనా ధుని పూజ చేయించుచుండగా సంస్థాన్ పూజారి ఒకరు నారికేళము నిచ్చి బాబా ప్రసాదంగా స్వీకరించ మన్నాడు. సాయినాథుని ఆశీస్సులు కూడ లభించాయని సంతసించి స్వామీజీ నిర్ణయించిన ముహూర్తమునకే ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆచార్య వాగేష్‌ను షిరిడీకి రప్పించి నాసిక్ నివాసియైన రామానంద బాబా మరియు స్వామీజీ భక్త బృందం సమక్షంలోను భూమి పూజా కార్యక్రమ మును నిర్వహించారు. పూజా సమయానికి నాందేడ్‌కర్ (కాండ్రే) ద్వారా నారికేళములు, పళ్ళు, పూలు, బాబా ప్రసాదం పంపి స్వామీజీ తమ ఆశీ ర్వాదము తెలియజేసారు. స్థలాన్ని స్వామీజీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించ టానికి అనుమతి వేడగా స్వామి “నాకు ఏ విధమైన ఆస్తిపాస్తులు వద్దు, నా ఈ జీవితం సాయి సేవకే అంకితం” అని వారి కోర్కెను నిర్మోహ మాటంగా త్రోసిపుచ్చారు. స్వామీజీ యొక్క ఈ చర్య తనకు సాయి సేవ యందు తప్ప మరే దాని పైన కోర్కె లేదని సుస్పష్టము చేయుచున్నది.

శ్రీమతి జరీనాకు అన్నిటికంటే ముఖ్యమైనది జన్మజన్మలకు మరువ లేని మరుపురాని దివ్యలీలను స్వామీజీ ప్రసాదించారు. ఇది చదివిన మీరు కూడ స్వామీజీ ఎంతటి మహిమాన్వితులో గ్రహించగలరు.

శ్రీమతి జరీనా స్వగృహమైన (నట-షాహి, 69సి, ఒర్లీ సీ ఫేస్, ముంబాయి-400 025)లో 23.09.1993 ఈ సంఘటన జరిగింది. సముద్రతీరానికి అతి సమీపంలో నుండుట వలన కిటికీలు తెరచి ఉంచితే వర్షాకాలంలో వర్షపు నీరు ఇంటి లోపలికి వచ్చేవి. ఆ కారణంగా ఆమె ఎల్లప్పడు కిటికి తలుపులు మూసి ఉంచేది. కానీ, ఆ రోజున ఆమె పూజ ముగించుకుని స్వామీజీ విగ్రహానికి నైవేద్యం, నూతన వస్త్రములను సమర్పించిన తరువాత 16 x 14 అడుగుల వైశాల్యం గల ఆ గది కిటికీలు అతి సమీపంలో గలదు. **(సశేషం)**





**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

లాంఛనప్రాయంగా ఆయనను మహారాజని కూడా అంటూ ఉండేవారు. ఉగ్రసేనుడు శాంతిప్రియుడు, స్నేహవత్సలుడు, అనుభవ వివేకాలు గల ఉదారహృదయులు.

గణాలలో విభేదాలను తగ్గించుకునేందుకు ఉగ్రసేనుడు తన పుత్రిక సుతను అక్రూరునికిచ్చి వివాహం చేశాడు. అలా గణాల మధ్య అను బంధాలు పెంచుకొన్నాడు.

మధురలో యాదవులు ‘సుధర్మ’ అనే పేర ఒక గణసంఘ భవనాన్ని నిర్మించుకున్నారు. అందులోనే వివిధ యాదవగణాల పెద్దలు, ప్రతినిధు లుగా సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుండేవారు. గణసంఘాల పరస్పర సమస్యలను పరిష్కరించుకుంటూ ఉండేవారు. పరిపాలన ఆ తీర్మానాలను బట్టి నడుస్తుండేది.

ఉగ్రసేనునికి మొదటి కుమారుడు కంసుడు. కంసునికి గణసంఘం విధానం నచ్చలేదు. యాదవగణాలలో అంధకుల బలం అధికంగా ఉండడాన కంసుడు తండ్రికి గణ సంఘాలిచ్చిన అధికారాలను క్రమంగా తాను స్వాయత్తం చేసుకున్నాడు. అంధకులలోని ధూర్తులను, ఉద్ధత బుద్ధుల్ని తన చుట్టూ చేర్చుకుని, మధురలోను పరిసరాలలోనూ తాను నమ్మిన మనుషులను పరిపాలనా యంత్రాంగంలో అధికారులుగా నియమించాడు.

యాదవ ప్రముఖుల కదలికలను కనిపెట్టి ఉండే రహస్య చార వ్యవస్థను ఏర్పరిచాడు. తనకు వ్యతిరేకంగా కనిపించిన వారిని చాటు

మాటున మట్టు పెట్టిస్తుండేవాడు.

అతనికి అడ్డు వచ్చేదల్లా వసుదేవుడు, అక్రూరుడు. యాదవగణాలలో శాంతచిత్తుడని, సరళ హృదయుడని, సమతావాది అని పేరు. వసుదేవుడంటే యాదవగణాలకు విశ్వాసం. ఆయన కారణజన్ముడని నమ్మేవారు. గణప్రముఖులందరి నోళ్లలో నాలికలా, అందరినీ కలిపి నడిపేవాడాయన.

ఉగ్రసేనుని తమ్ముడు దేవకుడు. అతని కూతురే దేవకి. ఉగ్రసేనుడు ఆలోచించి, ఉభయ గణాల అనుబంధాలను ఇంకా గట్టిపరచుకోవాలనే ఉద్దేశ్యంతో దేవకిని వసుదేవునికిచ్చి వివాహం జరిపించాడు.

వివాహపు రోజు ఊరేగింపు దేవలోకపు శోభలను తలపిస్తూ సాగింది. ఆ జంటను చూచి లోకమంతా మనసా ఆనందించి దీవించింది.

అదే సందర్భంగా దేవర్షి నారదుడు కంసుణ్ణి కలుసుకున్నాడు. అతణ్ణి దుర్మార్గపునడతను మానుకొని వంశమర్యాదను కాపాడుకొమ్మని సలహా ఇచ్చాడు. కాని కంసుడు తానే గణసంఘానికి ప్రభువునన్నాడు. తన్నెదిరించిన వాడెవడైనా అంతం కాక తప్పదన్నాడు. తనను ఏ శ్రుతీ, ఏ నీతీ శాసించలేదని గర్వించాడు.

నారదుడు 'కంసా! ఇంతటి అహంకారం పనికిరాదు. నీ మరణం దేవకీవసుదేవులకు పుట్టిన ఎనిమిదవ సంతానం చేతుల్లో జరుగుతుం' దని పలికి వెళ్లిపోయినాడు. ఆనాటినుండి వసుదేవుడంటే కంసునికి పగ.

కంసునికి వసుదేవుణ్ణి, ఆక్రూరుణ్ణి తన దారి నుండి తప్పించడానికి నారదవాణి ఒక అవకాశమైంది. ఆ నవదంపతులు దేవకీ వసుదేవులను కారాగారంలో బంధించాడు. అక్కడి నుంచి నిరంకుశంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. క్రమంగా దేవకికి ఎనిమిదిమంది సంతానం కలిగింది. అందులో ఆర్గురుని కంసుడు అమానుషంగా నేలమీద విసిరికొట్టి చంపాడు. తన ప్రభావాన్ని ప్రదర్శించుకోడానికి ఈ విధంగా క్రూరంగా ప్రవర్తించినా అతనికి ఫలితం దక్కలేదు. పోగా తీవ్రమైన వ్యతిరేకత వ్యాపిం





చింది. దేవకీ వసుదేవల పట్ల యాదవులందరిలో అంతులేని ఆదర గౌరవాలు, అభిమాన ప్రేమలు ఏర్పడ్డాయి. ఏడవ సంతానం అతణ్ణి హెచ్చరించి అంతర్ధానమైంది. పైగా కంసవధ ఆ దేవకీ వసుదేవుల ఎనిమిదవ సంతానం ద్వారా జరుగుతుందనే మాట సర్వత్రా అమృతవచనంలా వ్యాపించింది. ఆ ఆపదుద్ధారకుణ్ణి కనే దివ్యదంపతులు దేవకీ వసుదేవులు. ఆ ప్రభువును కనడానికే, కంసుని క్రూరకర్మల నుండి లోకాన్ని కాపాడడానికే, ఇన్ని బాధలు పడుతున్నారనే భక్తి భావన సహజంగా ప్రతి గుండెనూ ఆర్ద్రమొనరించింది.

మరి చెరసాల కాపలాదారులు, అధికారులు కూడా సహజంగానే ఆ అష్టమగర్భ సంజాతుణ్ణి తప్పించడానికి సహాయపడ్డారు. కంస కిరాతకానికి బలి అవుతూ వచ్చిన యాదవులను కాపాడడానికి వసుదేవ, అక్రూర, ఉగ్రసేనులతో నందుడు కూడా కలిసి నడుస్తుండేవాడు. అతడే కృష్ణుణ్ణి కనగానే స్వీకరించి తన బిడ్డనిగా పెంచాడు. ఆయనతోపాటు బలరాముడు, ఉద్దవుడు కూడా గోకులంలోనే పెరిగారు.

గోకులం కృష్ణుని రాకతో నందనవనమే అయింది. ఒక్కసారి ఆ చిన్నారి కృష్ణయ్యను చూస్తే ప్రపంచంలో మరే వస్తువు పట్లా దృష్టిపోదట. ఆయన మన్మథ మన్మథుడు. తప్త కాంచనవర్ణుడు. ఆయన ముఖంలో వేయి విద్యుల్లతలు మెరుస్తూంటాయి. పీతాంబరధారి. మెడలో వనమాల, నెత్తిన నెమలిపింఛ మమర్చిన కిరీటం, తీర్చిదిద్దిన తిలకం. క్రమంగా కృష్ణుడు గోకులంలో పరిసర యాదవ నివేశనాలలో ఇంటింటి దీపమై, స్నేహితుడుగా, ప్రేమమూర్తిగా, వాత్సల్య నిధానంగా, అద్భుత చమత్కారాలను ప్రదర్శించే వీరరసాధి దేవతగా, దుష్టుల ప్రవృత్తులను శిక్షించే శాస్తగా గుర్తింపు పొందాడు. గోవర్ధనగిరి ఎత్తిపట్టాడు. కాళీయనాగుణ్ణి అతని పరివారంతోసహా మానవ నివాసాలలో కనిపించకుండా తరిమికొట్టాడు. పూతన చనుబాలతోపాటు ప్రాణాలను కూడా త్రాగి సంహరించాడు.

**(సశేషం)**

బాలవాణి

# మట్టిలోకి రొట్టె

- శుకవాణి

అనగనగా ఓ ఇల్లు. ఇంట్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. ఒక పదిహేను, పదహారేళ్ల పిల్లవాడు తల్లితో అంటున్నాడు-"అమ్మా, నేను రేపు ప్రొద్దున్నే ఊరికి వెళ్ళాలి; మా అయ్యగారు పాలమూరు వెళ్లి ఒక పని చేసుకురావాలని చెప్పారు".

"అలాగా! ఎన్నింటికి బయలుదేరాలిరా?" అడిగింది తల్లి.

"సూర్యుడు పొడిచేసరికి బయలుదేరాలి. మంచి రొట్టెలు రెండు చేసిస్తే చాలు. మళ్లీ సాయంత్రానికే వచ్చేస్తాను"- అన్నాడు పిల్లవాడు.

"రెండు రొట్టెలెందుకురా! నువ్వసలు ఒకటి కూడా పూర్తిగా తినలేవు గానీ!" అంది తల్లి నవ్వుతూ.

"నాకు ఒక్కటే చాలమ్మా! రెండోది మట్టిలోకిలే! రెండు చేసివ్వు" అన్నాడు అబ్బాయి.

ఈ మాటలన్నీ బయట అరుగు మీద పడుకొని బద్ధకంగా ఆకాశంలోకి చూస్తున్న రంగడి చెవిన పడ్డాయి. రంగడు పరమ వీర సోమరి. తన ముక్కు మీద ఈగ వాలితే తోలడానికి ఎవరినో పిలిచే రకం. అసలు వాడు తల్లి కడుపులోంచి అందరిలాగా తొమ్మిది నెలలు నిండగానే బయటకు రాలేదు. పదకొండో నెల వచ్చేవరకు కూడా బద్ధకంగా అలా పడుకొని పోయాడు. అలాంటిరకం మన రంగడు. వాడికి తల్లీ, తండ్రీ లేరు. పని చెయ్యడానికి తగని బద్ధకం. ఎప్పుడో కడుపులో బాగా కరకర ఆకలైతే తప్ప పనిలోకి పోడు. వాడికి ఈ తల్లీ కొడుకుల సంభాషణ వినగానే బోలెడు సంతోషం వేసింది. "హమ్మయ్య! రేపటికిక పనిలోకి వెళ్ళక్కర్లేదు. ఈ కుర్రాడు ఒక రొట్టె మట్టిలో పడేస్తానంటున్నాడు. అది కాస్తా దులుపు కొని తీసుకుంటే పొట్ట నిండిపోతుంది" అనుకున్నాడు.





అవున్రా పిల్లలూ! రొట్టె అంటే ఏదో చపాతీలాగా అనుకొంటున్నారా? కాదు - ఇం....త లావునుండే దిబ్బరొట్టె! ఒకటి మొత్తం మొత్తం తినేస్తే ఒక రోజంతా ఆకలన్నదే ఉండదు. అదీ సంగతి!

సరే-తెల్లవారింది. ఇంటి వాళ్లబ్బాయి స్నానం గీనం చేసేసాడు. దేవుడికి రెండు పూలు పెట్టి, అగరువత్తి వెలిగించి, నమస్కారం చేసాడు. తల్లి యిచ్చిన రొట్టెల మూట తీసుకొని, ఆమెకు నమస్కారం చేసి, ఊరికి బయలుదేరాడు. ఆ వెనకే కాస్త దూరంలో మన రంగడు కూడా బయల్దేరాడు మెల్లగా. స్నానం చెయ్యలేదు సరిగదా-ముఖమైనా కడుక్కు న్నాడో లేదో. సరే- రెండు మూడు గంటలసేపు ముందు అబ్బాయీ, వెనక రంగడూ నడుస్తూపోయారు. అడవి దారిగుండా ప్రయాణం సాగుతోంది. బాగా ఎండెక్కిపోయేటప్పటికి అబ్బాయి అలిసిపోయాడు. త్రోవ పక్కన ఒక బావి దగ్గర ఆగాడు. ప్రక్కనే ఉన్న చెట్టు కొమ్మకి రొట్టెలమూట తగిలించి, బావి గిలకకి కట్టి ఉన్న తాటాకు బొక్కనతో నీళ్లు తోడుకొని, కాళ్ళూ, చేతులూ, ముఖమూ కడుక్కున్నాడు. మెల్లగా వచ్చి, చెట్టు క్రింద కూర్చొని మూట విప్పాడు. సరిగ్గా, అప్పటికి వచ్చి ఎదురుగా కూర్చున్నాడు మన రంగడు. రొట్టె విరిచి నోట్లో పెట్టుకోబోతున్న అబ్బాయి "రొట్టె తింటావా అన్నా!" అని మర్యాదగా అడిగాడు. "ఎందుకు తిననూ!" అన్నాడు రంగడు.

అబ్బాయి ఒక ఆకు కోసి తెచ్చి దానిలో రొట్టె పెట్టి రంగడికిచ్చాడు. ఇద్దరూ తిని మంచినీళ్ళు త్రాగారు. విశ్రాంతిగా నడుం వాల్చారు. అప్పుడు రంగడు ఒక ప్రశ్న వేసాడు. "అబ్బాయ్! నువ్వు రాత్రి మీ అమ్మతో నీకొకటీ, మట్టిలోకొకటీ - రెండు రొట్టెలు కావాలన్నావు; మరి యిప్పుడేమో నువ్వొకటి తిని నాకొకటిచ్చావు. మట్టిలో ఏమీ వెయ్యలేదు. అబద్ధం ఆడినట్లు కాలేదా!" అబ్బాయి నవ్వాడు.

"ఓహో! రాత్రి మా మాటలు విన్నావా! ఐనా నేనేం అబద్ధం ఆడలేదన్నా! ఇప్పుడు నేనో రొట్టె తిన్నాను. తెల్లవారితే అది కాస్తా మట్టిపాలే అవుతుంది

గదా! నీకో రొట్టె పెట్టాను. పై జన్మకు అదే పది రొట్టెలై నాకోసం వస్తాయి. నాకు కాస్త పుణ్యం తెచ్చేది నువ్వు తిన్నదే! అంటే అదే నాకు, నేను తిన్నది మట్టికి. అర్థమైందా?" అన్నాడు.

అబ్బాయి మాటలతో రంగడు ఆలోచనలో పడ్డాడు. ఓహో! ఇదెప్పుడూ తనకు తట్టలేదే! తానెప్పుడూ తన పొట్టకు సరిపడేంత మాత్రమే సంపాదించుకొని తిని బద్ధకంగా బతుకుతున్నాడు. ఇతరులకెన్నడూ ఏమీ పెట్టటం లేదు. అబ్బాయి చెప్పింది బాగుంది. ఇతరులకిచ్చిందే మనకు మరో జన్మకు పెట్టుబడి. రంగడు నిశ్చయం చేసుకున్నాడు. ఇకనుంచీ నేనిలా సోమరిగా బ్రతకను. కష్టపడి పనిచేస్తాను. వచ్చిన దానిలో నేను తినగా మిగిలిన దానితో దానధర్మాలు చేస్తాను. పుణ్యం సంపాదించు కుంటాను". "మీ అయ్యగారి దగ్గర నాక్కూడా పనిప్పిస్తావా?" రంగడు అబ్బాయి నడిగాడు. సరేనన్నాడు అబ్బాయి. రంగడు సంతోషంగా అబ్బాయి వెంట నడిచాడు.

**పిడుదు ఆవు పొదుగునకు దగ్గరే ఉన్నప్పటికీ అమృతము వంటి**
**క్షీరమును ఆస్వాదించక, రక్తమునే పీల్చుచుండును.**
**ఆ విధంగానే జీవుడు దేవునకు అతి సమీపమున ఉన్నప్పటికినీ**
**నశ్వరములగు దృశ్య పదార్థములనే కోరుచుండును.**
**కానీ, అమృతతత్వమును కోరుకుండును.**

**విద్యా విధానానికంతా, శిక్షణకంతా వ్యక్తిత్వాభివృద్ధే లక్ష్యంగా**
**ఉండాలి. అయితే వ్యక్తిత్వాని అభివృద్ధి చేయటానికి బదులుగా**
**మనం పైపై మెరుగులను దిద్దటానికి ప్రయత్నిస్తున్నాం.**





ఓం శ్రీ గురుభ్యో నమః ఓం శ్రీమాత్రే నమః ఓం సర్వమహర్షిభ్యో నమః

వేదం వేదాంతం సంస్కృతం

# శ్రీ సనాతన ఋషి విద్యాలయమ్ ద్వారా

## వేదాంత విజ్ఞాన శిక్షణా తరగతులు (6 నెలలు)

**ప్రధానాచార్యులు :**

1. **పూజ్యపాద శ్రీశ్రీశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు**
   **(న్యాయ, వేదాంత సర్వదర్శనాచార్యులు),**
   **శ్రీ వశిష్ఠాశ్రమ, శ్రీ లలితాపీఠ సంస్థాపకులు**
2. **పూజ్యపాద శ్రీశ్రీశ్రీ ప్రకాశానంద సరస్వతీ స్వాముల వారు**
   **(శ్రీ స్వామి దయానంద సరస్వతీ శిష్యులు),**
   **ఆర్ష విద్యా గురుకులం, కోయంబత్తూరు.**

## స్థలము : శ్రీ వశిష్ఠాశ్రమము, శ్రీనివాస మంగాపురం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్-516 102

## శిక్షణ సమయము :

## 24-07-2021 నుండి 24-01-2022 వరకు

పవిత్రాత్మ స్వరూపులగు జిజ్ఞాసువులారా! దివ్యమైన, భవ్యమైన మన భారతీయ సనాతన సంస్కృతికి పునాదులు ఆశ్రమాలు, దేవాలయాలే. వీటిని నిర్వహిస్తూ, మానవాళికి మన సంస్కృతి, సదాచారాలతోపాటు మానవజన్మ పరమపురుషార్థమైన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అందించే సాధుసంతులు, సద్గృహస్తులు క్షీణిస్తున్న వైనం మనం కనులారా చూస్తున్నాము. ఇట్టి తరుణంలో ఇట్టి సజ్జనులను సమాజానికి అందించే సత్సంకల్పంతో శ్రీ వశిష్ఠాశ్రమ, శ్రీ లలితాపీఠ సంస్థాపకులు పూజ్యపాద శ్రీశ్రీశ్రీ స్వరూపానందగిరి స్వాముల వారు సంకల్పించగా దానికి మేము అండదండగా నిలబడి శిక్షణా తరగతులను ముందుకు సాగిస్తామంటూ పూజ్యపాద శ్రీశ్రీశ్రీ ప్రకాశానంద సరస్వతీ స్వాముల వారు ఒక స్తంభంలాగా నిలబడ్డారు.

కావున, దేశభక్తి, ధర్మదీక్ష, మోక్షాసక్తి కలిగిన జిజ్ఞాసువులను ఈ శిక్షణకు సాదరంగా ఆహ్వానిస్తున్నాం. రండి! కలసి శ్రమిద్దాం. తరించి, తరింపచేద్దాం. ఓమ్.

## శిక్షణ వివరములు

- ఉ. గం.6.00ల నుండి 7.30 వరకు సాధనాక్రమంలో ధ్యాన, పారాయణాదులు జరుగును. (దక్షిణామూర్తి స్తోత్రము, సాధన పంచకము, దశశాంతులు, శిక్షావల్లీ,

ఈశ, కేన, కైవల్యోపనిషత్తులు, భగవద్గీత పారాయణముండును.)

- ◆ ఉ. గం.9.30 నుండి 10.30 వరకు భజగోవిందము, ప్రశ్నోత్తరి, భర్తృహరి నీతి, వైరాగ్య శతకముల నుండి కొన్ని శ్లోకములు, తత్త్వబోధ, వేదాంతసారముల వ్యాఖ్యానము.
- ◆ ఉ. గం.11.00 నుండి 12.00 వరకు శ్రీ మద్భగవద్గీత 2, 12, 15, 16 అధ్యాయములు పరచ్ఛేద, ప్రతిపదార్థ తాత్పర్యములతో నేర్పుట, మిగిలిన అధ్యాయములు చక్కని ఉచ్చారణతో అక్షర దోషములు లేకుండా నేర్పించుట.
- ◆ సా. గం.4.00 నుండి 5.00 వరకు సంస్కృత సంగ్రహ వ్యాకరణ పరిచయము (సంజ్ఞ, సంధి, సమాస, కారక ప్రకరణములు).
- ◆ సా. గం.6.00 నుండి 7.00 వరకు షోడశోపచార పూజా విధానము, మేధాసూక్తము, దుర్గా సూక్తము, శ్రీసూక్తము, పురుషసూక్తము, మంత్రపుష్పాదులు నేర్పించుట.

## శిక్షణలో చేరేవారికి సూచనలు

- ◆ 15 నుండి 35 సంవత్సరముల లోపు అవివాహితులకు మరియు బ్రహ్మచారిణీ/బ్రహ్మచారులకు మరియు సన్యాసినీ/సన్యాసులకు అవకాశముండును. వీరికి భోజన, వసతి, వస్త్ర, విద్యాసాధనములు, సాధారణ వైద్య సౌకర్యములు సంస్థ తరఫున ఏర్పాటు చేయబడును.
- ◆ 35 సంవత్సరములు దాటిన వారు మరియు వానప్రస్థులు శిక్షణలో చేరదలచినచో 6 నెలలకుగాను రూ.25,000/-లు మొదటనే కట్టి చేరవలసియుండును. ఇట్టి వారికి భోజన, వసతి, విద్యా సాధనములు సంస్థ తరఫున ఏర్పాటు చేయబడును.
- ◆ శిక్షణలో చేరే వారికి తెలుగు, హిందీ, ఇంగ్లీషు మాధ్యమములో బోధన ఉండును.
- ◆ శిక్షణ పూర్తి చేసే సాధకులకు సంస్థ తరఫున ప్రమాణ పత్రములు ఇవ్వబడును.

సూచన : 1. సీట్లు పరిమితముగా నుండును, జిజ్ఞాసువులు త్వరపడగలరు.

2. ఈ ఆరుమాసాల శిక్షణ తరువాత 2 లేక 3 సం.ల కోర్సు శ్రీ శంకర వేదాంతా నుగుణముగా ప్రస్థానత్రయము మరియు ఇతర దర్శన గ్రంథములు మరియు సంస్కృత ప్రశిక్షణ ఇచ్చుటకు ఆలోచించడమైనది.

వివరములకు
**9440486392**
**9426009812**
web : www.vasistaashram.org
email : info@vasistaashram.org

ఇట్లు
శ్రీ వశిష్ఠాశ్రమము
శ్రీనివాస మంగాపురం
తిరుపతి, ఆం.ప్ర. 517 102





# తీరు మారితేనే తీర్థయాత్రా ఫలం!

పాండవులందరూ ఓ మారు తీర్థయాత్రలు చేయాలని సంకల్పించారు. తమ మార్గదర్శి, ఆత్మీయ బంధువు, శ్రేయోభిలాషి అయిన శ్రీ కృష్ణ పరమాత్ముడిని కూడా తోడుగా తీసుకువెళ్ళాలని అనుకున్నారు. ఓ శుభ సమయంలో తమ మనస్సులో మాట చెప్పడానికి పాండవులందరూ ఆ పరంధాముడి దగ్గరకు వెళ్ళారు. కానీ, పనుల ఒత్తిడి వల్ల తాను రాలేక పోతున్నాననీ, అయితే తన ప్రతినిధిగా 'ఈ కాయను తీసుకువెళ్ళి తీర్థ యాత్రలన్నీ తిప్పండి' అంటూ ఆ రుక్మిణీ వల్లభుడు, ఓ సొరకాయను పాండవుల చేతిలో పెట్టాడు. వాళ్ళు ఆ కాయను తమ ఆత్మబంధువుకు ప్రతిరూపంగా భావించి, తమ వెంట తీసుకువెళ్ళారు. దేశంలోని ఎన్నో పుణ్యక్షేత్రాలను పాండవులు దర్శించుకున్నారు. పుణ్యతీర్థాల్లో స్నానాలు ఆచరించారు. గంగతోసహా నదులన్నింటికీ, చివరకు సాగరస్నానాలకు కూడా తమతోపాటు శ్రీకృష్ణుడిచ్చిన ఆ కాయను తీసుకువెళ్ళారు. జలాలలో తడిపారు. కొన్నాళ్ళకు యాత్రలన్నీ ముగించుకొని హస్తినాపురానికి చేరు కున్నారు. తరువాత పాండవులు ఆ వాసుదేవుడి పాదాలకు నమస్కరించి, సొరకాయను కూడా యథావిధిగా ఆయనకు సమర్పించుకున్నారు. ఆ మధ్యాహ్నం మధుసూదనుడు, పాండవులకు ఆతిథ్యాన్ని ఏర్పాటు చేశాడు. వంటకాల్లో ఆ సొరకాయను కూడా తరిగి ఘుమఘుమలాడే కూరను చేయించాడు. పాండవులకు వడ్డించాడు. ఆ కూర కలుపుకొని ముద్ద నోట్లో పెట్టుకునేసరికి నోరంతా చేదెక్కింది. 'అదేంటి మహానుభావా! ఈ చేదు సొరకాయతో భోజనం పెట్టావు' అన్నారు. 'అయ్యో! ఇన్ని పుణ్యతీర్థాలు తిప్పారు కదా! ఈ సొరకాయలో చేదు పోయి, తీయగా మారిపోయిం దనుకున్నాను' అన్నాడు ఆ సర్వసాక్షీభూతుడు. అప్పుడు అర్థమైంది ఆ కుంతీ పుత్రులకు కృష్ణ పరమాత్ముడి అంతరార్థం. ఎన్ని పుణ్యతీర్థాలు దర్శించుకున్నా

అంతరంగంలో మార్పు రానంతకాలం ఫలమేమీ ఉండదని అర్థం చేసుకున్నారు. అదే భావాన్ని జగద్గురువులు శంకరాచార్యుల ప్రియశిష్యుడు వర్తికాకారులు 'భజగోవిందం ... భజగోవిందం' శ్లోక పరంపరను కొనసాగిస్తూ ...

కురుతే గంగాసాగర గమనం, వ్రత పరిపాలన మథవా దానమ్ ।
జ్ఞానవిహీనః సర్వమతేన, ముక్తిం న భబతి జన్మ శతేన్ ॥

"గంగానదిలోనో, సముద్రంలోనో స్నానం చేసినా, వ్రతాలు ఆచరించినా, 'జ్ఞానం' లేని వారికి వంద జన్మలెత్తినా ముక్తి లభించద"ని స్పష్టం చేస్తున్నారు. ఈ బాహ్య ఆచారాలన్నీ సాధనలో ప్రాథమిక అంశాలే! వీటి నుంచి జ్ఞానంతో మరింత ముందుకువెళితేనే మనకు ఆధ్యాత్మిక పురోగతి సాధ్యపడుతుంది; ఆత్మశక్తి మేలుకుంటుంది.

**పుణ్యక్షేత్రాలు పర్యాటక ప్రాంతాలు కాదు....:** పవిత్రమైన దేవాలయ క్షేత్రాలంటే విహారప్రాంతాలనే అభిప్రాయం మనలో చాలామందికి ఉంటుంది. అందుకే తీర్థయాత్రలకు కూడా ఏదో పర్యాటక కేంద్రాలకు వెళ్లినట్లుగా వెళ్లి 'నలుగురితో నారాయణ' అని నదుల్లో, సాగరాల్లో మునిగి, ఆ జ్ఞాపకంగా నాలుగు ఛాయాచిత్రాలు దిగి ఇళ్లకు వచ్చేస్తూ ఉంటారు. కానీ, దీనివల్ల ఏ మాత్రం ఫలితం ఉండదు. పైగా అక్కడ కూడా సకల సౌకర్యాల కోసం తపిస్తూ ఉంటారు. శీఘ్ర దర్శనాల కోసం పలుకుబడిని ఉపయోగించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. రామేశ్వరం పోయినా శనీశ్వరం వదలనట్లు ఇంటి పోరునంతా ఈశ్వరుడి దాకా తీసుకువెళతారు. అలా కాకుండా ఆయా క్షేత్రాల్లోని ఆధ్యాత్మిక శక్తిని మనలో ఆవాహన చేసుకోవాలంటే ఎంతో భక్తితో, విశ్వాసంతో దర్శించుకోవాలి. మన హంగులు, ఆర్భాటాలు, హోదాలు-అన్నింటినీ పక్కనపెట్టి పూర్తి శరణాగతితో ఆయన చరణాలను ఆశ్రయించాలి. ఏకాంతంగా అక్కడ కొంతసేపు జపధ్యానాదులను ఆచరించాలి, మనస్ఫూర్తిగా ఆ భగవంతుడిని ప్రార్థించుకోవాలి. తత్ఫలితంగా ఎంతో కొంత క్షేత్రప్రభావం మనపై పడుతుంది.

**భక్తి, జ్ఞానమే భగవంతుడికి ప్రీతి :** ప్రచారంతో, పటాటోపంతో కూడిన వ్రతాలు, దానాలు కూడా ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వవని ఆది శంకరాచార్యుల ఆత్మీయ శిష్యుడు ఉద్ఘాటిస్తున్నారు. మనం ఆచరించే వ్రతాలు, పూజలు చాలావరకు యాంత్రికంగా మారిపోయాయి. రోజువారీ దిన చర్యల్లో వాటిని కూడా ఒక భాగంగా చేర్చి ఏదో 'మమ' అనిపిస్తున్నాం. అందుకే వాటి ఫలశ్రుతి కూడా అదే స్థాయిలో ఉంటుంది. మనస్సు పెట్టి మంత్రాలు చదవకుండా ఎన్నిసార్లు వల్లెవేసినా ఫలితమేమీ ఉండదు. ఆయా వ్రతాలు, పూజాదికాలు మనల్ని ఆ భగవంతుడికి దగ్గర చేయాలి. మనస్సులో భక్తి, జ్ఞానమనే బీజాలను నాటాలి. అదే విధంగా సాటి మనిషికి మనం గావించే సేవ, ఒనరించే దానాది కార్యక్రమాల విషయంలో కూడా అమితమైన గుర్తింపును కోరుకుంటూ ఉన్నాం. ఇలాంటివి ఆధ్యాత్మికంగా మనకు ఉన్నతిని సాధించిపెట్టవు. అంతా భగవన్మయంగా చూడగలిగినప్పుడు, చేసే దానం వీలైనంత మేరకు గుప్తంగా చేసినప్పుడు మనలో అహంకారం, అధిక్యభావం పొడసూపవు. ఆ దేవదేవుడు మన ద్వారా తన దాతృత్వాన్ని చాటుకుంటున్నాడన్న వినమ్రతతో-ఉన్నతి నలుగురికీ పంచిపెట్టాలి. అప్పడే పుణ్యం, పురుషార్థం! అందుకే ముందు భక్తిమార్గాన్ని ఆశ్రయించి, తద్వారా వివేకవైరాగ్యాలతో జ్ఞానాన్ని సముపార్జించాలి. ఇదే భావాన్ని తన కుమారుడు నారదుడికి విదితపరుస్తూ ఆ బ్రహ్మదేవుడు...

**ఉపవాసవ్రత శౌచశీల మఖ సంధ్యోపాస నాగ్నిక్రియా**
**జప దానాధ్యయనాది కర్మముల మోక్షప్రాప్తి సేకూర ద**
**చ్చపు భక్తిన్ హరి పుండరీకనయనున్ సర్వాతిశాయిన్ రమా**
**ధిపు పాపఘ్ను పరేశు నచ్యుతిని నర్థిం గొల్వలేకుండినన్**

"పద్మనేత్రుడూ, అన్నింటినీ మించినవాడు, లక్ష్మీకాంతుడు, పాపనాశకుడు, పరమేశ్వరుడు, చ్యుతిరహితుడూ అయిన శ్రీహరిని నిర్మలభక్తి

కలిగి ఆసక్తితో భజించాలి. అలా చేయకుండా ఉపవాసాలు, వ్రతాలు, శౌచాలు, యాగాలు, సంధ్యోపాసనలు, అగ్నికార్యాలు, జపాలు, దానాలు, వేదాధ్యయనాలు తదితరాలు ఎన్ని చేసినా మోక్షం లభించద"ని వివరిస్తాడు.

**వికారాలను వీడినప్పుడే మోక్షప్రాప్తి :** ఆచారాల అంతరార్థాలనూ, మంత్రాల పరమార్థాలనూ, ఆయా తీర్థస్థలాల మహాత్మ్యాలను మననం చేసుకుంటూ, తదనుగుణంగా మన నడవడికను మార్చుకున్నప్పుడు, అవన్నీ మన మనో వికారాల విరుగుడకు తోడ్పడతాయి. కానీ వాటినన్నింటినీ విస్మరించి, ఆంతరంగిక ప్రక్షాళనకు ప్రయత్నమేమీచేయకుండా సంప్రదాయాలను పాటిస్తూ మన జీవితంలో ఏవో అద్భుతాలు జరగాలనుకుంటాం. అదెన్నటికీ సాధ్యం కాదు. చెట్టు ఎక్కకుండానే ఫలాలను కోరుకోవడం ఎంత అవివేకమో, సాధనలేవీ చేయకుండానే, మనోమాలిన్యాలను పరిహరించు కోకుండానే మోక్షం ప్రాప్తించాలనుకోవడం కూడా అంతే అవివేకం. శ్రీ కాళహస్తీశ్వరుడి ముందు మహాకవి ధూర్జటి కూడా ఇదే తీరులో మథనపడుతూ ...

**విత్తజ్ఞానము పాదనిత్యము, భవావేశంబు రక్షాంబువుల్**
**మత్తత్వంబు, తదంకురంబనృతముల్, మారాకులత్యంత దు**
**ర్వృత్తుల్ పువ్వులు పండ్లు మన్మథ ముఖా విర్భూత దోషంబులు**
**చిత్తాభ్యున్నత నింబ భూజమునకున్, శ్రీ కాళహస్తీశ్వరా!**

'పరమేశ్వరా! మనస్సు నందు పెరుగుతున్న వేపచెట్టుకు అజ్ఞానమే విత్తనం. అశాశ్వతాలైన విషయాలే ఆ విత్తనం పాతడానికి ఏర్పరచిన పాదు. మనస్సునందు పుట్టిన ఆవేశమే దానికి కంచెగా ఏర్పరచిన రక్షణ కవచం. పలికెడి అసత్యాలే మొలక, చేసెడి చెడు పనులే ఆకులు, కామవికారాలే పూలూ పండ్లు. ఇలాంటి నింబవృక్షాన్ని నా మనస్సు నుంచి తొలగించి, జ్ఞానవృక్షానికి కారణమైన బీజాన్ని నా మనస్సులో నాటించమని వేడు కుంటాడు. నీవు ప్రసాదించిన ఇంద్రియాల్ని కట్టడి చేసుకునే శక్తిని నీవే ప్రసాదించమని ఆ పరమాత్ముడిని ప్రార్థించాలి.





**సమస్తమూ ఆ సర్వేశ్వరుడే :** భగవంతుడు దూరంగా ఎక్కడో ఉన్నాడను కోవడమే అజ్ఞానం. ఆయన ఇప్పుడు, ఇక్కడ ఉన్నాడనే స్పృహ కలగడమే జ్ఞానం. అలాంటి జ్ఞానజ్యోతిని మన అంతరంగంలో ఎంత త్వరగా వెలిగించ గలిగితే, అంత త్వరగా ముక్తి మార్గం మనకు గోచరమవుతుంది. అప్పుడు చూసిన చోటల్లా ఆ చిన్మయమూర్తే కనిపిస్తాడు; ఏ తీర్థంలో మునగక పోయినా భగవంతుడు మన ముంగిట వచ్చి నిలబడతాడు. అలా రామకృష్ణులు, రమణమహర్షిలాంటి ఎందరో మహాత్ములు తాము నడ యాడిన తావులనే తీర్థస్థలాలుగా మలచి భక్తులను తరింపజేశారు. సాధారణ మానవులుగా జీవించి సార్థక జీవనసూత్రాల్ని ఆచరించి బోధిం చారు. మానసిక ధార్మికతకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. అందుకే వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రుడితో -

**రాగద్వేషతమః క్రోధ మదమాత్సర్యం వర్జనం।**
**వినా రామ, తపోదానం, క్లేశేవ నవాస్తవం॥**

'ఓ రామా! కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలను త్యజించ కుండా, తపోదానాలు ఎన్ని చేసినా కష్టాలే మిగులుతాయ'ని హితవు పలుకుతాడు. అరిషడ్వర్గాలనే కలుపుమొక్కలను పెకిలించి, మనోక్షేత్రాన్ని పవిత్రం చేసుకుంటే భక్తి కుసుమం వికసిస్తుంది. జ్ఞానతేజం ప్రకాశిస్తుంది, మోక్షఫలం సిద్ధిస్తుంది.

**"ఓ వీర భారతపుత్రా, ధైర్యము వీడకుము. నేను భారతీయుడనని గర్వింపుము జీర్ణవస్త్రధారివగు, కౌపీన సూత్ర ధారివగు నీవును సగర్వముగా ఎలుగెత్తి ఘోషింపుము".**

**"భారతీయుడు నా సోదరుడు - నా ప్రాణములకు ప్రాణము, భారతీయ దేవతయే నా దైవత్వము - భారత సంఘము నా బాల్య డోలిక, యౌవన నందనవనము, వార్ధక్య వారణాసి".**

**- స్వామి వివేకానందులు**

# మాతృసంస్థ కబుర్లు

జనవరి 22, 24, 26, 30వ తేదీలలో అనేక గ్రామాలలో శ్రీరామ మందిర నిర్మాణ నిధి సమర్పణ అభియాన్ కార్యక్రమాలలో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు అయోధ్యలో రామాలయ నిర్మాణంలో జాతీయ స్వాభిమాన పునః ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు విరాళాలు సమర్పించుకోవాలని వివరించారు. ఈ నిర్మాణంలో పాల్గొనడం ఈ తరానికి కలిగిన అదృష్టం అన్నారు. స్వామీజీ చేసిన కార్యక్రమాల సందర్భంగా నిర్మాణనిధికి 10 లక్షల పైచిలుకు చేరాయని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేసారు.

జనవరి 26న 72వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సాయి విద్యా ధామం పాఠశాలలో 9, 10వ తరగతి పిల్లలు, ఉపాధ్యాయులు కొద్ది మందితో పతాకావిష్కరణ ముగిసింది.

ఫిబ్రవరి 16 శ్రీపంచమి సందర్భంగా సాయిధామం ఆశ్రమంలో పూజ్య స్వామీజీ వారి ఆధ్వర్యంలో ఆశ్రమ భక్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య సరస్వతీ దేవి పూజ భక్తి ప్రపత్తులతో నిర్వహించడం జరిగింది.

ఫిబ్రవరి 21 సాయిధామం సేవాశ్రమంలోని జ్ఞానధామంలో ఆశ్రమ పీఠాధిపతులు స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో ఆంగ్ల కాలమాన ప్రకారం పూజ్య గురుదేవుల 82వ జన్మ దినోత్సవ కార్యక్రమంలో గురుదేవులకు అభిషేకం, అలంకరణ, అష్టోత్తర శతనామ పూజ. అనంతరం స్వామీజీ వారు, డా॥ చంద్రారెడ్డిగార్లు ఆశ్రమంతో, గురువుగారితో వారికి ఉన్న అనుభవాలను పంచుకొన్నారు.

**శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి**

డిసెంబర్ 25వ తేదీ ముక్కోటి ఉత్తర ద్వార దర్శన కార్యక్రమం.





అత్యంత వైభవోపేతంగా జరిగినది. ప్రతి సంవత్సరం ముక్కోటి రోజు ఉత్తర ద్వార దర్శనానికి సత్తెనపల్లి పరిసర గ్రామాల ప్రజలు రావడం ఆనవాయితీగా వస్తున్నది. 24వ తేదీ నాటికి అన్ని ఆలయాలు శుభ్రం చేసి కార్యక్రమానికి సిద్ధం చేసాము. విద్యుద్దీపాలంకరణ, పూలాలంకరణ, క్యూలైన్ ఏర్పాటు, ప్రసాదం తయారుచేయడం, దర్శనానికి స్వామివార్లను నూతన వస్త్రాలంకరణచేయడం మొదలైన పనులతో ఆశ్రమమంతా భక్తుల సందడితో శోభాయమానంగా మారినది. సాయిధామం నుండి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు, శ్రీ చంద్రారెడ్డి బాబాయిగారు, శ్రీ శ్రీనివాసరావుగారు, తెనాలి నుండి శ్రీ గోపీకృష్ణగారు, శ్రీ సత్యనారాయణ గారు 24వ తేదీ సాయంత్రానికి వచ్చారు. 25వ తేదీ ఉదయం 4 గంటలకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో ప్రధాన ద్వారం నుండి పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి చిత్రపటము, పాదుకలతో కొబ్బరికాయ కొట్టి హారతులిచ్చి ద్వారము తెరవగా మంగళవాయిద్యాలు కమనీయంగా మ్రోగుతుండగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు రామాలయం, బాబా మందిరం ఉత్తర ద్వారాలు కొబ్బరికాయ కొట్టి తెరిచారు. అనంతరం ఆంజనేయ స్వామి, పరమపూజ్య గురుదేవుల మందిరాలలో కొబ్బరికాయ కొట్టి హారతు లిచ్చారు. స్వామి వార్లు, ఆలయాలు అలంకరణ శోభతో అలరారగా, భక్త జనసందోహం రామనామంతో దర్శనం చేసుకొని తరించారు. దాదాపుగా 3000 మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. వచ్చిన భక్తులందరికీ ప్రసాదం, త్రాగునీరు అందించటం, దర్శనానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆశ్రమ కార్యకర్తలు చేసిన ఏర్పాట్లను భక్తులు కొనియాడారు. వచ్చిన భక్తులకు బాబా మందిరంలో స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు విభూతి బొట్టు పెట్టి ఆశీర్వదించారు. మధ్యాహ్నం 2 గం.లకు కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా

సహకరించిన అందరికీ సాయిరక్ష.

బాబా మందిరంలో ప్రతిష్ఠితమైన దత్తాత్రేయుల వారికి పూజా కార్యక్రమం జరిగినది.

జనవరి 28 పౌర్ణమి సందర్భంగా సాయినాథ వ్రతం జరిగినది.

ఫిబ్రవరి 21వ తేదీ పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్య పదానంద ప్రభుజీ మహరాజ్ వారి 82వ జయంతి కార్యక్రమం వైభవో పేతంగా జరిగినది. గురుదేవుల మందిరాన్ని పూలతో అలంకరించి 82 సంఖ్యలో దీపాలను అలంకరించి పూజా కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన భక్తులకు గురుదేవుల ఆశీరక్షతలందించిన అనంతరం ప్రసాద వితరణ చేసాము.



**సాయివాణి పాఠకులకు,**

**శ్రేయోభిలాషులకు**

**సాయి భక్తులందరికీ**

**ప్లవ నామ సంవత్సర**

**మరియు**

**శ్రీరామ నవమి**

**శుభాకాంక్షలు**








**సాయిధామంలో**

# గురుదేవుల జన్మదినం





ప్రియ మిత్రులారా!

మరో ఫాల్గుణ బహుళ విదియ మార్చి 30వ తేదీన వస్తున్నది. మన గురుదేవులు భౌతికంగా లేరిప్పుడు. వారి జన్మదినం వస్తోంది. శ్రీరాముడు లేని శ్రీరామనవమి, కన్నయ్య లేని కృష్ణాష్టమి, దత్తుడు లేని దత్త జయంతి ఎలా జరుపుకుంటామో- అలాగే మన గురుదేవుల చిచ్ఛక్తిని స్మరిస్తూ వారి జన్మదినం ఆరోజు జరుపుకొందాం. వారి ప్రేమ, కరుణ, బోధ, ప్రసన్నతలు కలబోసిన జీవితాన్ని అందరం కలిసి స్మరించుకుందాం. జ్ఞానధామంలో గురు దేవులు శయనించిన చోట తలవాల్చి నమస్కరించుకుందాం. బాధ కలిగితే ఒకరినొకరు ఓదార్చుకుందాం. అందరం ప్రేమమయులైన ఆ స్వామి పాతికేళ్ళు నడయాడిన సాయిధామానికి వచ్చి ఆయన చెంత కొన్ని గంటలు గడిపి, వారి స్మృతులు కలబోసుకొని ధన్యుల మవుదాం. కార్యక్రమం ఇలా రూపొందించుకుంటున్నాం.

**మార్చి 30, 2021** ఉ. గం.8.00 శ్రీ సాయి పూజ

గం. 8.30-9.30 విష్ణు సహస్ర నామం, సాయిచాలీసా పారాయణ, భజన

గం. 10.00 శ్రీ గురుదేవులకు పాదుకాపూజ, గురుసంస్తుతి

గం. 10.30 భక్తుల భావ పరంపర

గం. 11.00 జ్ఞానధామంలో దీపాలంకరణ

గం. 11.30 ప్రవచనం, గురు నమస్కృతి

గం. 12.00 మహా హారతి

మ. గం. 1-00 అన్నప్రసాద వితరణ

అందరూ తరలి రండి - జ్ఞానధామాన్ని దర్శించి, గురుదేవుల సంస్మరణతో పునీతులు కండి.

**ప్రేమతో ఆహ్వానిస్తూ,**
**గురుచరణ స్మరణతో,**
**సాయిధామం**